క్లుప్తంగా

ఎలక్ట్రికల్‌షాపు పరిశీలన



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో సోమవారం మహిళా శక్తి రుణంతో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్‌షాపును ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ పరిశీలించారు. ఇందిరా మహిళాశక్తి ద్వారా రుణం తీసుకొని సరోజన అనే మహిళ కేశవపట్నంలో ఎలక్ట్రికల్‌షాపు ఏర్పాటు చేసుకోగా వ్యాపార వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుధాకర్, సీసీలు సంపత్, రాజు. లక్ష్మీనారాయణ, అజీమ్ ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్‌రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ శ్రీనివాస్‌జీ హెచ్చరించారు. పట్టణ శివారులోని కేసీ క్యాంపు ఏసీపీ కార్యాలయంలో వీణవంక మండలంలోని రౌడీ షీటర్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా అనుసరించాల్సిన పద్ధతులను తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో అల్లర్లు సృష్టించొద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని, చట్టానికి లోబడి నడుచుకోవాలన్నారు. రౌడీ షీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో జమ్మికుంటరూరల్ సీఐ కోరె కిషోర్, వీణవంక ఎస్సై తోట తిరుపతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పేరుమార్చి ఆసుపత్రి కొనసాగిస్తున్నారని ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలో అనుమతులు రద్దు చేసిన ఆసుపత్రి పేరు మార్చి వైద్య పరీక్షలు చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకుడు మోరె మధు సోమవారం జిల్లా వైద్యాధికారి సుజాతకు ఫిర్యాదు చేశారు. ఓ నర్సింగ్ హోంలో భ్రూణ హత్యలు జరగ్గా ఆసుపత్రి సీజ్ చేశారని, అదే యాజమాన్యం పేరు మార్చి ఆసుపత్రిని కొనసాగిస్తున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

జమ్మికుంట: పట్టణంలోని ఎల్‌ఐసీ శాటిలైట్ కార్యాయం ఎదుట ఆల్ ఇండియా ఎల్ఐఏఫ్ఐ (లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఇండియా) పిలుపు మేరకు ఎల్‌ఐసీ ఏజెంట్లు సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా కొత్త పాలసీలకు పాత పద్ధతిలో కమిషన్ ఇవ్వాలని, పాలసీదారుల ప్రీమియంకు జీఎస్టీ తొలగించాలన్నారు. లక్ష ఎస్ఏ పాలసీని పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఏజెంట్ల సంఘం నాయకులు పంజాల ప్రభాకర్, సంపత్‌రావు, ఎగ్గెటి కుమారస్వామి, సమ్మయ్య, ఒగ్గు రమేశ్, శ్రీనివాస్, సమ్మారావు, నగేశ్, రాంబాబు, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాసుల పంపిణీ



హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ ఆర్టీసీ బస్ డిపో సిబ్బంది మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల బాలురకు ఉచిత బస్సు పాసులను అందజేశారు. ఈసందర్భంగా సోమవారం గంగిశెట్టి జగదీశ్వర్(రిటైర్డ్ టీచర్) చేతుల మీదుగా పాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది డి.ఐలయ్య, సీహెచ్ సాయికిరణ్, ప్రజా సంఘాల నాయకుడు వేల్పుల ప్రభాకర్, ఉపాధ్యాయులు జి.రాధిక, ఏ. సుమతి, మొగిలి, సంపత్ పారిజాత, ఝాన్సీరాణి, రాజశ్రీ, విజయలత, చంద్రప్రభ, సంపత్ పాల్గొన్నారు.

రామడుగును ‘సుడా’లో చేర్చొద్దు

రామడుగు: మండలంలోని గ్రామాలను సుడాలోకి చేర్చొద్దని, ప్రజలు ఇబ్బందిపడాల్సి వస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి జూపాక మునీందర్, మండల యూత్ అధ్యక్షుడు పర్లపల్లి మహేశ్ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుడా పరిధిలోకి మార్చితే ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని, దీన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

లోలెవల్ బ్రిడ్జిపై కూలిన ధాన్యం బస్తాలు

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల వాగు లోలెవల్ బ్రిడ్జిపై సోమవారం ట్రాక్టర్‌లో నుంచి ధాన్యం బస్తాలు కిందపడిపోయాయి. వీణవంక మండలం ఎల్బాక గ్రామానికి చెందిన ఊట్ల స్వామిదాసు శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామశివారులోని రైస్‌మిల్లుకు ధాన్యం లోడు చేసుకొని ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా బస్తాలు కిందపడిపోగా ఎవరికి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదాలు జరగకుండా హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.



టెండర్లు పిలిచి.. పనులు చేపట్టండి

- పంచాయతీరాజ్ అధికారులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆదేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: మానకొండూర్ నియోజకవర్గానికి మంజూరైన రూ.4.90 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవాలని, త్వరగా పనులు చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మహాత్మానగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... మానకొండూర్, శంకరపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, వంటగదులు, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, అర్హులకు కాంట్రాక్ట్ అప్పగిస్తూ పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయించాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ డీఈలు మంజుభార్గవి, రవిప్రసాద్, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

రామడుగు: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని, కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని ఐకేపీ, రామడుగు, కొక్కెరకుంట సింగిల్ విండో ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలను కొక్కెరకుంట, రుద్రారం, రంగసాయిపల్లి, దత్తోజీపల్లి, లక్ష్మీపూర్, గుండి, షానగర్, దేశరాజ్‌పల్లి, వెలిచాల గ్రామాల్లో సోమవారం ప్రారంభించారు. రామడుగు, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్లు వెంకటేశ్వర్‌రావు, మురళీకృష్ణారెడ్డి, గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తిరుమల, మాజీ ఎంపీపీ హరీశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంజనీప్రసాద్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షుడు తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రతి విద్యార్థి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం విద్య వ్యవస్థను పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్, జీపీ ప్రత్యేకాధికారి శ్రావణ్‌కుమార్, నాయకులు నరేందర్‌రెడ్డి, కోల రమేష్, వంశీ, హన్మంతు, మల్లేశం, రాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

వీణవంకలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

వీణవంక: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక సోమవారం రాత్రి వరకు జరిగింది. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు 26 గ్రామ పంచాయతీల్లో జరిగిన రూ.5.35కోట్ల ఈజీఎస్ పనులకు సంబంధించి వివరాలను సీఆర్పీలు అధికారులకు చదివి వినిపించారు. రూ.61 వేలు దుర్వినియోగం కాగా వాటిని రికవరీ చేయాలని డీఆర్‌డీవో శ్రీధర్ ఆదేశించారు. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణ, డీవీవో వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఎంపీడీవో శ్రీధర్, ఏపీవో స్వామి, సీఆర్‌పీలు, జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

మానకొండూర్: ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధ వెంకటరెడ్డి అన్నారు. మానకొండూర్‌లోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం సీపీఎం మానకొండూర్ మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జెండాను జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ ఆవిష్కరించారు. అనంతరం కామ్రేడ్ సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధాదేవ్ బట్టాచార్య మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మూడేళ్లుగా చేసిన పోరాటాలు, ఉద్యమాలపై సమీక్ష చేసి భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన చేస్తామన్నారు. ప్రధానంగా గ్రామాల్లోని సమస్యలపై స్పందించాలన్నారు. అనంతరం మహాసభ నూతన కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా సీహెచ్ భద్రయ్య, కమిటీ సభ్యులుగా నారాయణ, సంపత్, రవి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మన్, సంపత్, కనుకయ్య, ఇద్దరు కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు.

హామీలు మరిచారు

చిగురుమామిడి: గౌరవెల్లి భూనిర్వాసితులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల సమయంలో ఎకరానికి రూ.30 లక్షల పరిహారం ఇప్పిస్తానని రూ.11 నుంచి రూ.12 లక్షలు మాత్రమే ఇప్పిస్తామనడం ఎంతవరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం చిగురుమామిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టులో నీరు నింపకపోవడంతో రైతులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. ప్రాజెక్టులో కనీసం రెండు లేదా, మూడు టీఎంసీ ల నీరు నింపితే భూగర్భ జలాలు పైవచ్చి రైతులకు రెండు పంటలు పండే అవకాశం ఉందన్నారు. రైతులకు అన్యాయం జరిగే ఊరుకోబోమని, కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించినప్పటికి రైస్‌మిల్లుల అలాట్‌మెంట్ ఎందుకు చేయలేదని, మంత్రి గారు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్‌లైన్ రోడ్ మంజూరు చేయడం సంతోషించదగిన విషయమన్నారు. మాజీ ఎంపీపీ వినీత, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. చిగురుమామిడిలో నెల రోజులుగా నిర్వహించిన ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీల ముగింపు సమావేశానికి హాజరై విన్నర్ కోహెడ మండల టీమ్, రన్నర్ చిగురుమామిడి మండలం సుందరగిరి టీంకు నగదు, షీల్డ్ పంపిణీ చేశారు.

ఫీజు బకాయిలపై నిరసన

హుజూరాబాద్‌రూరల్: ప్రైవేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం ఫీజు బకాయిలు, రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో యాజమన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని, చదువు పూర్తయిన ఫీజు రీయిబర్స్‌మెంట్ రాకపోవంతో సర్టిఫికెట్లను ఇవ్వటం లేదన్నారు. ప్రైవేట్ కళాశాలలు మూసివేత దిశగా అడుగులు వేస్తున్నాయన్నారు. ఫీజు బకాయిలను చెల్లించాలని కోరారు. నిరసనలో మండల కమిటీ అధ్యక్షుడు సందేష్, కమిటీ మెంబర్స్ ఉన్నారు.

‘దళితబంధు’ వచ్చేదాకా పోరాటం

వీణవంక: కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లనే దళితబంధు రెండో విడుత నిధులు రావడంలేదని నిధులు వచ్చేదాకా పోరాటం చేస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. వీణవంకలోని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటికి కొందరు లబ్ధిదారులు వచ్చారు. కౌశిక్‌రెడ్డి ఇంట్లో లేకపోవడంతో విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ నీల కుమార్ అక్కడికి చేరుకొని మాట్లాడారు. ఎమ్మెల్యేకు సమాచారం అందించడంతో కౌశిక్‌రెడ్డి లబ్ధిదారులతో ఫోన్లో మాట్లాడారు. అప్పటి సీఎం కేసీఆర్ హుజూరాబాద్‌ను ఎంపిక చేశారని, కాంగ్రెస్ నాయకులు పని గట్టుకొని రెచ్చగొడుతున్నారని, లబ్ధిదారులు అర్థం చేసుకోవాలని, ఎవరు అధైర్యపడొద్దని లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వీణవంక: మండలంలోని ఆయా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సోమవారం అధికారులు ప్రారంభించారు. మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ సిబ్బంది సూచించారు. ఐకేపీ ఏపీఎం కొంరయ్య, గన్‌శ్యాం, శ్రీకాంత్, తిరుపతి, పద్మ, పీఏసీఎస్ డైరెక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రం వెన్కెపల్లి ఈర్లబండ వద్ద ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మంజుల ప్రారంభించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఏపీఎం కుమారస్వామి, చైర్‌పర్సన్ పిట్టల శైలజ, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ముద్రబోయిన శంకర్, గూడూరి ప్రభాకర్‌రెడ్డి, బొడ్డు అనసూర్య, దండ భాస్కర్‌రెడ్డి, యాళ్ల సుజాత, గొస్కుల శ్రీనివాస్, ప్రతాప ఆంజనేయులు, నరెడ్ల మధుసూధన్‌రెడ్డి, సంగాల రవీందర్, సిరికొండ లింగరావు, లోకిని సాయిలు, మూగల లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్, మాజీ ఎంపీటీసీ బండి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చొప్పదండి మండలంలో..

చొప్పదండి: మండలంలోని రెవెల్లి, పెద్ద కుర్మపల్లి, దేశాయిపేట, మంగళపల్లి, చిట్యాలపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఎమ్మెల్యే సత్యం ప్రారంభిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం కుడి చెరువులో చేపపిల్లల విడుదల కార్యక్రమం ఉంటుందని, సాయంత్రం క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించొద్దు

ఇల్లందకుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఇల్లందకుంట ప్రజా సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ చెల్పూరి రాము అన్నారు. ప్రజాసంఘాల ఇల్లందకుంట మండల కన్వీనర్‌గా చెల్పూరి రామును సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా తిప్పరబోయిన శ్రీకాంత్, సంతోష్, కొత్తూరి మల్లయ్య, ఆరెల్లి ఓదెలు, రాజేందర్, గంధసిరి సంపత్, మల్లేశ్, రవి ఎన్నికయ్యారు. నమ్మకంతో మండల కన్వీనర్‌గా ఎన్నుకున్న ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు ఉద్యమాలు, పోరాటాలు చేపడతామన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో జీపీ వ్యవస్థ నిర్వీర్యం

మానకొండూర్‌రూరల్: బీఆర్‌ఎస్ పాలనలో గ్రామ పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఊటూరు గ్రామాన్ని సోమవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా సందర్శించారు. గ్రామంలోని వీధులు, కాలనీలు, రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల సమస్యలను నా దృష్టికి ఎందుకు తీసుకురాలేదని గ్రామస్తులను ప్రశ్నించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇళ్లు లేని నిరుపేదలకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తదితర నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతులు వెలగాలి



ప్రచారం చేస్తున్న రవీందర్‌రెడ్డి, తదితరులు

శంకరపట్నం: ప్రతి ఇంటిలో దీపావళి జ్ఞానజ్యోతులు వెలగాలని త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి జ్ఞాన వేదిక అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని తాడికల్ గ్రామంలో సోమవారం త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, రాధిక, జ్యోతి, సతీశ్, రమేశ్, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం నాయకుల వినతి



హుజూరాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్/రామడుగు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం హుజూరాబాద్ తహసీల్దార్ కనకయ్య, రామడుగు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయడంతో పాటు పీఆర్సీ కమిటీ నివేదికను అమలు చేయాలని వినతిపత్రంలో కోరారు. సంఘం అధ్యక్షుడు పవన్ కుమార్, నాయకులు రాజేందర్, రాంప్రసాద్,అరుణ్ కుమార్, వెంకటేష్ టీపీయూఎస్ మండల ప్రధాన కార్యదర్శి మండల ప్రేమ్‌చంద్రారెడ్డి, నాయకులు వెంకట్ రాజారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, హరిప్రసాద్, అశోక్‌రెడ్డి, దత్తాత్రి శర్మ పాల్గొన్నారు.



వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో ప్రత్యేకాధికారుల పాలన అటకెక్కింది. ఇక్కడి కార్యదర్శి ఇటీవల బదిలీపై వెళ్లగా పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించలేదని, దీంతో గ్రామంలో సమస్యలు పేరుకుపోతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీధర్, ఎంపీడీవో, వీణవంక, సెల్ నంబర్ : 99899 30710

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9393557752

ప్రజా బాగోగుకంటే.. పైసా వసూలే లక్ష్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మాజీ ఎమ్మెల్యే రసమయి ఫైర్



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

తిమ్మాపూర్: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దోపిడీదారుగా మారారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కుటుంబంపై కక్షగట్టిందని, దావత్‌ను రేవ్ పార్టీగా ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించారు. ధనార్జనే ధ్యేయంగా ఎమ్మెల్యే వసూళ్లకు పాల్పడుతున్నాడని, అభివృద్ధి పనుల ఊసే లేదని, ఎమ్మెల్యే మాదిరి నాయకులు, కార్యకర్తలు తయారవుతున్నారని ఆరోపించారు. మానకొండూర్ నియోజకవర్గంలో పనిచేయని ఎస్సై శివప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు హరిప్రసాద్‌రెడ్డికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏం పనుందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అండతో సీఐ, ఎస్సైలు బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలను బెదిరిస్తున్నారని, అరుంధతి కళ్యాణ మండపాన్ని దళితులకు అప్పగించాలని అంబేద్కర్ సంఘం నాయకులు వంతడుపుల సంపత్, బోయిని కొమురయ్య, మాతంగి లక్ష్మణ్, ఖమ్మం కృష్ణ డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు మాతంగి లక్ష్మణ్, పాశం అశోక్ రెడ్డి, సాయిల్ల కొంరయ్య, పొన్నం అనిల్‌గౌడ్, రాజేందర్, రమేశ్, మల్లయ్య, కొమురయ్య, సంపత్, కృష్ణ ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు



నెట్ క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న రసమయి

తిమ్మాపూర్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు క్రీడల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని ఇందిరానగర్‌లో నెట్ క్రికెట్ గ్రౌండ్‌ను మాజీ సర్పంచ్ మెంగని రమేశ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సంపత్, సదానందం, అంజయ్య, ప్రియ డెయిరీ డైరెక్టర్ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

ఇద్దరిపై కేసు

రామడుగు: మండల కేంద్రానికి చెందిన కీర్తి మహేశ్‌ను నాగి సూరజు, కలిగేటి గణేశ్ చంపుతామని బెదిరించడంతో సోమవారం కేసు నమోదు చేశామని ఎస్సై వి.శేఖర్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

దాడి ఘటనపై ఉన్నత అధికారులకు నివేదిక

చిగురుమామిడి: దళిత దివ్యాంగుడు మాతంగి తిరుపతిపై డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథి దాడి చేసిన విషయం తెలిసిందే. ఘటనపై తహసీల్దార్ ఎం.రమేశ్ కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్‌కు సోమవారం నివేదిక పంపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏంజరిగిందనే విషయంపై సిబ్బందిని అడిగారు. దాడి ఘటన సీసీపుటేజీలో రికార్డు కాగా రికార్డులను తొలగించేందుకు డిప్యూటీ తహసీల్దార్ ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఏదిఏమైనా వాస్తవాల ఆధారంగా దాడికి పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు అంటున్నారు. ఏదేని పరిస్థితుల్లో అందుకు విరుద్ధంగా అటెండర్‌పై చర్యలు తీసుకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించేందుకు సిద్ధమవుతామని పేర్కొన్నారు.

ఐదుగురికి జరిమానా

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి హుజూరాబాద్ న్యాయమూర్తి ఈశ్వరయ్య జరిమానా విధించినట్లు ఎస్సై రవి తెలిపారు. సోమవారం కోర్టులో హాజరుపరిచామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో సోమవారం ఇసుకట్రాక్టర్‌ను పట్టుకున్నామని కేశవపట్నం ఎస్సై రవి తెలిపారు. గ్రామంలో వాహనాలు తనఖీ చేస్తుండగా అనుమతి లేకుండా మానకొండూర్ నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పత్తి వాహనంలో బంగారు ఆభరణాల వెతుకులాట

జమ్మికుంట: ఇంటి వద్ద నిల్వ చేసిన పత్తిలో ఓ రైతు బంగారు వస్తువులు, నగదు దాచి పత్తి అమ్మకానికి తీసుకురాగా మిల్లులో వెతుకులాట జమ్మికుంటలో పుకారు కలకలం రేపింది. జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌కు అవసరాల నిమిత్తం ఓ రైతు పత్తిని అమ్మకానికి తీసుకవచ్చాడు. బంగారు వస్తువులు, నగదు తెలియకుండా పత్తి వాహనంలో వచ్చాయని ఆందోళన చెందాడు. ట్రాలీ డ్రైవర్ తెలియజేసి ఓ మిల్లులో దిగుమతి సమయంలో వెతికించాడు. డ్రైవర్ మాత్రం ఒకసారి బంగారం, ఒకసారి నగదు అంటున్నాడని తెలిసింది. దిగుమతి చేసిన మిల్లులో సోదాలు చేసినా ఏం దొరకలేదన్నాడు. ఇదే విషయం బాధిత రైతును సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

అతి జాగ్రతలు నష్టపోయేలా చేస్తాయి

నిల్వ చేసిన పత్తిలో బంగారం, నగదు దాస్తుంటారు. రైతు అతి జాగ్రత్త ఆర్థికంగా నష్టపోయేలా చేస్తుందని ఈసంఘటన తెలియజేస్తుంది. ఇంట్లో బంగారం, నగదు దాచి ఉంచే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని పలువురు చూచిస్తున్నారు.

రోడ్డు ఆక్రమణ ఫిర్యాదుపై నిర్లక్ష్యం

జమ్మికుంట: పట్టణంలోని దుర్గాకాలనీలో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించాడని, మున్సిపల్ అధికారులు, కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ అక్రమణదారుడిపై చర్యలు తీసుకోవడం లేదని గుంటి వెంకటలక్ష్మి అనే మహిళ సోమవారం ఆరోపించిది. సదరు వ్యక్తి ఇంటి నిర్మాణం ప్రారంభించిన ప్పటి నుంచి ఫిర్యాదు చేశామని, దారి లేకుండా చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.